# సొంత వూరు

## శ్రీ కంచి వాసుదేవరావు

'జననీ జన్మ భూమిశ్చ
స్వర్గాదపి గరీయసి' అన్నారు — అటువంటి పుట్టి పెరిగిన ఆ వూరికి ముప్పయి ఐదు సంవత్సరాల సుదీర్ఘకాలం తర్వాత అడుగుపెడుతుంటే మనస్సు ఉప్పొంగిపోవడంలో అబ్బుర మేముంది?

బస్సు దిగి ఆ గడ్డపైన తిరిగి కాలు మోపిన విశ్వనాథంగారి తనువు పులకించి పోయింది—అందులోనూ ఆ వూరంటే ఆయనకి చాల అభిమానం—అక్కడ యిళ్ల అద్దెంత చవుక—పాలు పెరుగు పుష్కలంగా దొరకుతాయి-కాస్ట్ ఆఫ్ లివింగ్ తక్కువ—ప్రశాంత వాతావరణం—మనుష్యులు చాల మంచి వారు—ఆ వూరికిగల చారిత్రిక ప్రసిద్ధి ఆయనకు గర్వకారణమయింది—ఒకప్పుడు — ఆయనను ఉడికించి, తమాషా చేయడానికి—ఆయన మిత్రులు ఆ వూరిని తిట్టేవాడు—దాంతో ఆయన మొహం కందగడ్డయి పోయేవి ఆవేశంతో వూగిపోయేవాడు—ఆ వూళ్లో పుట్టి, పేరు తెచ్చుకున్న రచయితలు, నటులు, గాయకులు—రాజకీయ నాయకులు పేర్లు ఏకరవు పెట్టేవాడు—బహమనీ సుల్తానుల కాలంలో, ఈస్టు యిండియా కంపెనీ కాలంలో ఆ రేవు పట్టణానికి గల వైభవాన్ని గురించి ఉపన్యసించేవాడు—

అంత అభిమానంగల విశ్వనాథంగారు ఆ వూరికి అంతదూరంగా అన్ని సంవత్సరాలు ఉన్నాడంటే- ఎవరికి వారు—ఆయనకే అమిత ఆశ్చర్యంగా వుంటుంది—కాని అసాధ్యమనుకున్న అనేక విషయాలను కాలం సుసాధ్యం చేస్తుంది - రైల్వేలో ఉద్యోగం వచ్చిన విశ్వనాథం—పుట్టి పెరిగిన ఆ వూరినీ కాస్త — ఆ జిల్లాను—ఆ రాష్ట్రాన్నీ విడచి, తన భాష, తన సంప్రదాయం కాని ఒరిస్సాకు వెళ్లిపోయాడు - వెళ్లే ముందు ఎంతబాధ పడ్డాడనీ!—'అసలు ఆ ఉద్యోగం వదలుకుందామా అనుకున్నాడు—కాని పుట్టి పెరిగి ఎన్నో సంవత్సరాలు ఆ వూళ్లో వుంటున్నా—సొంత యిల్లుకాని, పొలంకాని, స్వజనం కాని లేక కేవలం రెక్కలమీద ఆధారపడవలసిన తనవంటి వారు—ఇటువంటి సెంటిమెంట్సు పెట్టుకుని నిక్షేపంలాంటి రైల్వే ఉద్యోగాన్ని వదలుకోవడం తెలివితక్కువ అని స్నేహితులు బంధువులు సలహా యివ్వడంవలన ఆయన ఆ వూరు విడచిపోయాడు ఐనా అప్పుడప్పుడు — ఆ వూరు వచ్చిపోతూ వుండవచ్చులే- క్రమేణా తన ప్రాంతానికి ఉద్యోగంకోసం ప్రయత్నించ వచ్చుననీ—ఆశాభావాన్ని ఏర్పర్చుకుని మరీ ఆ వూరిని విడచి వెళ్లిపోయాడు—కానీ చిత్రం ఉద్యోగంనుంచి విరమించుకునేటంతవరకు—ఆయనకు ఈ వూరు రావడమే మళ్లీ పడలేదు—అన్నాళ్లూ ఆ పరాయి రాష్ట్రంలోనే వుండిపోయాడు—ట్రాన్స్‌ఫర్లూ ఆ రాష్ట్రంలోనే జరిగాయి—అన్నేళ్లు ఆ రాష్ట్రంలోవున్నా—తన పిల్లలూ—ఆ రాష్ట్రాన్నీ ఆ భాషనూ సొంతం చేసుకున్నట్లు—తను ఆ రాష్ట్రాన్నీ ఆ ప్రాంతాన్ని తనదిగా భావించలేక పోయేవాడు—అందువల్లనే — ఉద్యోగం విరమించుకున్నాక—తనకు వచ్చే ప్రావిడెంటు ఫండు — త్వరలో మిచూరు కానున్న యల్. ఐ. సీ పాలసీమీద వచ్చే డబ్బుతో—తను పుట్టి రెండు దశాబ్దాలుగా పెరిగిన ఆ వూళ్లోనే ఇల్లు కొనుక్కుని శేష జీవితాన్ని కృష్ణా రామా అంటూ గడిపివేయాలని ఆయన నిశ్చయించుకుని—అన్ని సంగతులూ విచారించడానికి ఇప్పుడు ఈ వూరికి వచ్చాడు—

తీరా బస్సుదిగిన తర్వాత ఎవరింటికి వెళాలి అన్న ప్రశ్నకు జవాబు లభించిన- ఎదురుగా ఉన్న

హోటలుకు వెళ్లి 'రూం' తీసుకున్నాడు—తాత్కాలిక మకాముగా—

స్నానంచేసి, కాఫీ ఫలహారాలు పూర్తిచేసుకుని—తను ఒకప్పుడు-అనేక సంవత్సరాలు నివసించిన యింటి వేపుకు నడక సాగించాడు—పరిచితమైన ఆ రోడ్ల మీద ఎవరైనా కన్పించకపోతారా అన్న ఆశ—ఇన్నేళ్ల తర్వాత—ఆ రోడ్ల స్పర్శలోని థ్రిల్ (?) అనుభవించా లన్న ఉద్దేశంతో—రిక్షాలో వెళ్లకుండా, నెమ్మదిగా నడక సాగించాడు.

రోడ్లు మారలేదు — కట్టడాలు గుర్తుపట్టలే నంతగా మారిపోలేదు—కాని తనకు తెలిసిన మనుష్యులు ఎవరూ కనపడకపోయేటప్పటికి ఆయనలో ఒక విధ మైన నిరాశ కలిగింది—

తను పూర్వంవున్న యింటి ప్రదేశానికి జేరు కున్నాడు — ఇప్పుడు— అక్కడ— ఆ పొట్టిగుమ్మాల పెంకుటిల్లు లేదు—దానిస్థానే రెండు అంతస్థుల భవనం వుంది—అందులో ఏదో ఆఫీసువుంది—యిల్లు యింకా అల్లాగే వుంటుంది అని తను భ్రమపడ్డం—తనకే చిత్రంగా తోచింది. ఆ యిల్లు అంటే తనకి అభిమానం-తను అక్కడే పుట్టాడు—అక్కడే పెరి గాడు—ఆ యింటి దొడ్లలోవున్న చెట్లెక్కి ఆడాడు—అక్కడే చదువు పూర్తయింది—పెళ్లయింది—తండ్రి, తల్లి ఆ యింట్లోనే మరణించారు—అది తన స్వంత యిల్లుకాదు—కాని స్వంత యింటికన్న ఎక్కువ అభిమా నంగా చూచుకునేవారు—ఆ రోజుల్లో యింటి యజ మానులకు—ఇంటి అద్దెకున్నా— ఆ యింట్లో అద్దె కుండేవారి మంచితనానికి ఎక్కువ విలువ యిచ్చేవారు—ఇంటి యజమానులనీ, అద్దెకుండేవారనీ ఆ విధంగా కలసిపోయినందుకే అన్ని సంవత్సరాలు ఆ యింట్లో వుండగలిగి దానిపై ఒక మమకారాన్ని పెంచు కున్నాడు -

ఆ యింటి ఎదురు బొదురుగావున్న యిళ్లల్లో పెద్ద మార్పులు లేవు—కానీ ఎరుగున్నవాళ్లెవరూ అక్కడా కన్పించలేదు—

విశ్వనాథంగారు ఆఫీసులో ప్రవేశించి మేనే జరు గదివైపుకు వెళ్లారు—మేనేజర్ సీటులో ముప్ఫ య్యేళ్ల యువకుడు—తన పెద్దకొడుకు ఈడు వాడు కన్పించాడు—' మే ఐకమిన్ ప్లీజ్'—అని అంటున్న తననిచూచి అతను వినయంగా 'కమిన్ సార్—హవ్ కెన్ ఐ హెల్ప్యుయు'—అన్నాడు.

విశ్వనాథంగారు పక్కనున్న కుర్చీలో కూర్చుని ముందుకువంగి నెమ్మదిగా 'నా పిచ్చిసెంటిమెంటుకు మీరు నవ్వుకోకుండా వుంటానంటే ఒకమాట—ముప్పయి ఐదేళ్ల క్రిందట నేను యీ యింట్లో వుండేవాడిని—ఆ యిల్లు యిప్పుడంతా మారిపోయింది అనుకోండి—ఐనా— ఒకసారి యీ ప్రాంగణమంతా తిరిగి రావాలని వుంది—' మేనేజర్‌గారు ఆ మాటలు విని ఆశ్చర్యపోయాడు — వెర్రి వేయివిధాలంటారు ఇదే కాబోలు! ఐనా యిది ప్రమాదం కలిగించని వెర్రి—అంగీకరించడంలో తప్పేముంది? అన్న ఆలో చనతో—నౌకరును పిలిచి 'ఈ బాబుగారు ఎప్పుడో చాల రోజుల క్రితం — ఈ యింట్లో వున్నారు —ఇప్పుడు చూడ్డానికి వచ్చారు—వీరిని తీసు వెళ్లి మన ఆఫీసు గదులూ—అద్దెలకు యిచ్చిన వాటాలూ చూపించు' అన్నాడు—నౌకరు విశ్వనాథంగారి వంక వింతగా చూచి 'రండి బాబూ' అని తీసుకొని వెళ్లాడు.

ఒకప్పుడు— ఆ యింటికి పెద్ద పెరడు వుండేది—అందులో కొబ్బరి, జామ, మామిడి, సపోటా చెట్లు వుండేవి-చంద్రకాంత, మల్లెమందార, పూల మొక్కలు, సన్నజాజీ తీగలూ వుండేవి — ప్రతిరోజు ఉదయం తెలతెలవారుతూ వుండగా ఇరుగు పొరుగు గృహిణులు పూలసజ్జలు పట్టుకుని పూజకు పూలు కోసుకు వెళ్తూవుండేవారు—ఇప్పుడు దొడ్డి అంతా పోయింది—అద్దెల దృష్టితో — అద్దెకు యిచ్చే వాటాలు కట్టేసారు—ఈ ముప్పది ఐదేళ్ల చరిత్రకు సాక్షీభూతమా అన్నట్లు ఒక్కకొబ్బరి చెట్టుమటుకు యింకా నిలిచి వుంది—'నిరుడు కురిసిన హిమ సుమంబులు ఏవి తల్లీ'—అన్నట్లు- అప్పటి పూలు ఏవి—అప్పటి కాయలేవి—అప్పటి గదులేవి — ఇందులో

తను భోజనం చేసిన వంటిల్లు—చదువుకున్న వసారా—పడుకున్న గది—ఎక్కినచెట్లు — యిక్కడ వుండేవని గుర్తుతెచ్చుకోవడం ఎల్లా?—

'ఎవరు చంద్రయ్యా వీరు?'—అని ఆ అద్దె వాటాల్లో వున్న వాళ్ల అడిగిన ప్రశ్నలను — అతను యిచ్చే సమాధానాలు విని వారు తనవంక విచిత్రంగా చూస్తుంటే విశ్వనాధంగారు కొంత ఇరకాటంలో పడ్డారు—

ఐదు నిముషాలలో విశ్వనాధంగారు తిరిగి మేనేజరుగారి గది వద్దకు వచ్చాడు—అతను ఆయనను చూచి చిరునవ్వుతో 'గండి—అంతా చూశారా?' అని అడిగాడు—

'చూశాను బాబూ—థ్యాంక్సు—మీరు యీ యిల్లు కొనుక్కున్నారా?—అద్దెకు వుంటున్నారా' అని అడిగారు విశ్వనాధంగారు—

'మేము కొని ఐదారేళ్లయిందండీ—ఆ పెంకుటింటిని పడగొట్టి ఇదంతా చేసింది మేమే—

'ఆ యింటి వాళ్లెక్కడ వున్నారండీ'—

బాగుపడ దల్చుకున్నవారు ఈ వూళ్లో ఎందుకుంటారండీ—ఇల్లు అమ్మేసుకుని ముగ్గురు అన్నదమ్ములలో ఒకరు హైదరాబాదులో వుండిపోయాడు—మరొకరు గుంటూరులో ఏదో వ్యాపారం చేస్తున్నారట. చివరతను నెల్లూరులో గవర్నమెంటు సర్వీసులో వున్నాడు—ఇది రెండేళ్ల సంగతి— ఆ తర్వాత డిటెయిల్సు తెలియవు — అన్నట్లు మీ గురించి ఏమీ చెప్పారు కారు' అన్నాడు మేనేజర్—

'నేను యస్‌యీ రైల్వేలో పనిచేసి రీసెంటుగానే రిటయిరయ్యాను— పెద్దపిల్లాడు ఢిల్లీలో వున్నాడు—రెండవవాడు కలకత్తాలో వున్నాడు — మూడవవాడు రైల్వేలో చక్రధరపూర్‌లో పనిచేస్తున్నాడు—అమ్మాయి కటక్ మెడికలు కాలేజీలో యం.బి.బి.యస్. చదువుతోంది—ఉద్యోగం అయిపోయింది కనుక — రిటైర్డు లైఫ్ ఎక్కడ గడపాలా అన్న ఆలోచన వచ్చింది—నామిసెస్‌కి, పిల్లలకి అంత యిష్టం లేకపోయినా పుట్టి పెరిగిన మమకారం పోవందున నేను యీ వూళ్లో సెటిల్ అవుతామనుకుంటున్నాను— ఇక్కడే ఒక్క యిల్లు కొనుక్కునే ఆలోచనలో వున్నాను' అన్నారు విశ్వనాధంగారు—

'మేనేజర్ పెద్దగా నవ్వుతూ' ఏముందండీ యీ ప్రరలో చవుటు వూరే యిళ్లుతప్ప—ఐనా మీలాంటి రిటైర్డు పీపులుకు యీ వూరు బాగా సూట్ అవుతుంది' లెండి అన్నాడు—

విశ్వనాధంగారు కాస్త చిన్నబుచ్చుకుని 'నేను ఓ సెంటిమెంటల్ ఫూలును బాబూ'—అన్నాడు—అని సెలవు తీసుకుని బయటకు వచ్చాడు—

ఇందాక తనకు ఆ యిల్లంతా చూపించిన నౌకరు ఆయన వెంటపడ్డాడు— ఆయన కాఫీకి వాడి జేబిలో ఓ పావులాపెట్టి ముందుకు సాగాడు.

ఆ యింటికి కొద్ది గజాల దూరంలో నాగేశ్వరస్వామి ఆలయం వుంది— ఆ రోజుల్లో రామమూర్తి శాస్త్రుర్లుగారి ప్రతిరోజూ సాయంత్రం పురాణ కాలక్షేపం జేసేవాడు. ప్రతిరోజూ తను విడువకుండా వెళ్లి వినేవాడు — రామాయణం — భారతము—భాగవతం—ఆయన ముఖతహా విన్నాడు - యింతవరకు మరచిపోలేదు—అంత చక్కగా చెప్పేవాడు—గొప్ప విద్వత్తుగలవాడు—డబ్బువంక కన్నెత్తి చూచేవాడు కాదు—

ఇక గుళ్లో పూజారి కృష్ణయ్య—అమిత నిష్ఠాపరుడు—బ్రహ్మవర్చస్సు ఎల్లా వుంటుందో చూడాలంటే ఆయన ముఖమే చూడాలి—ఆయన మంత్రించి విభూతి యిస్తే ఏ దుష్టగ్రహమయినా దూరంగా వుండేది—అమ్మవారి సహస్రనామ పూజ ఆయన చేస్తుండగా చూడాలి—ఒళ్లంతా కందిపోయేది—ఆయన తదేక దీక్షతో నామ నామమూ ఉచ్చైస్వరముతో ఉచ్చరించి పూజచేస్తుంటే వినే వాళ్ల శరీరాలు గగుర్పొడిచేవి — ఆ గుడికి డబ్బున్నవారు వచ్చేవారు—లేనివారు వచ్చేవారు— పళ్లెంలో డబ్బు వేసేవారు కొందరు—మానేవారు చాలమంది—ఐనా అందరినీ ఒకే విధంగా చూచేవాడు ఆయన.

ప్రతిరోజూ రెండు పూటలా స్వామి దర్శనం చేసుకుని అయ్యవారి విభూతీ, అమ్మవారి కుంకుమా పెట్టుకుని రావలసిందే—పరీక్షలకు వెళ్లేముందు ఆ దేవుడికి నమస్కరించి వెళ్లవలసిందే - పరీక్ష ప్యాస వుతే ముందర అక్కడ కొబ్బరికాయ కొట్టవలసిందే.

ఆ రోజులే వేరు!

విశ్వనాధంగారు ఆ గుళ్లోకి ప్రవేశించాడు. ఇప్పుడు కరెంటు వచ్చింది. ఆ ప్రాంగణంలో రామా లయం— సత్యనారాయణస్వామి ఆలయం వెలిసాయి. గర్భగుళ్లో ఎవరో కుర్రవాడు—పూజారి విధులు నిర్వర్తిస్తున్నాడు—ఆ కుర్రవాడి చూపు పళ్లెంలో పడే డబ్బులుపైనీ— ఇన్నాళ్లకు ఆ స్వామినీ, ఆ తల్లిని చూస్తే ఒళ్లు పులకించి పోయింది 'స్వామీ నిన్ను మరచి పోలేదు—వెతుక్కుంటూ వచ్చాను' అనుకుంటూ నమస్కరించాడు—నిన్ను మేమూ మర్చిపోలేదయ్యా అని వాళ్లు అన్నట్లు తనకు అనిపించింది.

గర్భగుడినుంచి వచ్చాక మండపంమీద కాసేపు కూర్చుని బయటికి వచ్చాడు—సాయంత్రం తన ఒక నాటి స్నేహితుల గురించి భోగట్టా చేయాలను కుంటూ బజారుకువచ్చి—ఒక హోటలులో కాఫీ తాగు తామని వెళ్లాడు. ఒకప్పుడు—ఆ హోటలు చాల ప్రసిద్ధి వహించింది—ఆ వూరికంతా అదే పెద్ద హోటలు—ఆ వూరికి వచ్చిన ప్రతికవీ, రచయిత— ఆ హోటల్లో కాఫీ తాగకుండా వెళ్లేవారుకారు.

పెసరెట్టుతిని కాఫీ తాగుతూవుంటే—తనకి ఎదురుగా కూర్చున్న ఒక వ్యక్తి—దాదాపు తనయీడు వాడే తన వంక పరిశీలనగా చూడడం గమనించారు విశ్వనాధంగారు-అతన్ని తనూ పోల్చుకోలేక పోతున్నాడు.

ఆ వ్యక్తి నవ్వుతూ 'మీ పేరు విశ్వనాధం కాదూ' అన్నాడు.

'అవునూ! మరి...మీరు...?'

'నన్ను యింకా గుర్తుపట లేదా!...నేను వెంక టేశ్వర్లుని—సైన్సు మాష్టారు అప్పారావుగారి అబ్బా యిని'-అన్నాడు.

'ఓరి నువ్వా'

'ఆరి నీసీ' అంటూ—యిదేమిటి ఎప్పుడు— యీ వూళ్లో వూడిపడ్డావు...ఏం చేస్తున్నావు... అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు వెంకటేశ్వర్లు.

విశ్వనాధంగారు క్లుప్తంగా తన గురించి చెప్పు కున్నాడు.

బిల్లు వెంకటేశ్వర్లే చెల్లించి-సర్కిల్లి పేటలో వున్న తన యింటికి రమ్మని— భోజనంచేసి వెళ్లమని అడిగాడు— విశ్వనాధంగారు కాదనలేదు — రిక్షాలో వెళ్దామని వెంకటేశ్వర్లు అంటూవుంటే 'వద్దు వెంకటేశ్వర్లూ—నడచి వెళ్దాం—ఇన్నేళ్లకి యీ వూరు వచ్చిన తర్వాత ఎంత నడిచినా తనివి తీరడం లేదు'— అన్నాడు.

దోవలో వెంకటేశ్వర్లు చెప్పినదంతా విన్నాక అతను ఎంత 'అదృష్టవంతుడో' విశ్వనాధానికి అర్థ మయింది.

వెంకటేశ్వర్లు తండ్రి అప్పారావుగారు హిందూ హైస్కూలో టీచరు-ఇతనుకూడా అదే స్కూలులో టీచరుగా పనిచేసి రిటైరయ్యాడు—ఇప్పుడు ట్యుటో రియలు కాలేజి నడుపుతున్నాడు—తండ్రియిచ్చిన పెంకు టింటిని డాబా చేశాడు. పెద్దకొడుకుతన మాదిరిగానే బందరులో బియిడి ప్యాసయి టీచరు ఉద్యోగం చేస్తు న్నాడు. రెండవవాడు యల్ఐసీలో అక్కడే వుద్యోగం మూడవవాడు కోపరేటివ్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. ఒక కూతురిని ఆ వూళ్లోనే యిచ్చాడు. అల్లుడు ప్లీడరు—రెండవ కూతురికి యింకా పెళ్లిచేయవలసిఉంది. ఇద్దరు కొడుకులకు పెళ్లి అయింది. అందరూ — అదే యింట్లో సమష్టిగా చూడముచ్చటగా జీవిస్తున్నారు — 'దూరదేశాలకుపోయి పెద్ద ఉద్యోగాలు చేయడంకన్నా, వున్న వూళ్లో చిన్న వుద్యోగాలు చేసుకుని- బంధుకోటి అంతా ఒకచోట వుండడంబోయి' అన్న వెంకటేశ్వర్లు మాటలలో విశ్వనాధంగారికి ఎంతో నిజమనిపించింది—

వెంకటేశ్వర్లుగారి యిల్లు చూస్తే ఎంతో ముచ్చట వేసింది—దొడ్డిలో ఎన్నో కూరగాయల మొక్క

లమ పాదులను పెంచుతున్నాడు – పూలమొక్కలు వున్నాయి–పిల్లలు ఎంతో మర్యాద ఎరిగి ప్రవర్తిం చారు–నిజంగా వెంకటేశ్వర్లు చాల అదృష్టవంతుడు–

రెండో కూతురికి పెళ్లి సంబంధాలు చూస్తు న్నాననీ, ఆ మధ్య భోపాలులో పని చేస్తున్న ఒక సంబంధం వచ్చిందనీ, వాని పిల్లను అంతదూరం యివ్వడానికి యిష్టంలేక—అన్నీ నచ్చినా ఆ సంబంధం వదలుకున్నాననీ, దగ్గరవూరి సంబంధాలకోసం ప్రయ త్నిస్తున్నానని వెంకటేశ్వర్లు చెప్పినప్పుడు — తన కూతురు కటక్‌లో ఒరియా యంబీఫైనలు యియరు స్టూడెంటును ప్రేమించింది–తను ఆ సంబంధానికి యిష్టపడడం వీడన్న సంగతి గుర్తుకు వచ్చింది—

భోజనాలు అయ్యాక విశ్వనాథంగారు తను వచ్చిన పని మళ్లీ చెప్పాడు –ఇల్లు కొందామని వుద్దే శంతో వున్నానని చెప్పాడు–ఆ మాటలు విని వెంక టేశ్వర్లు చాల సంతోషించాడు–'వున్నవాళ్లు ఈ వూరు విడచిపోతుంటే, ఎప్పుడో యీ వూరు విడచి వెళ్లిపోయిన నువ్వు యింత అభిమానంతో తిరిగి రావడం నాకు చాల సంతోషంగ వుంది. గొడుగుపేటలో—మనకు తెలిసిన వాళ్ల యిల్లు ఒకటి అమ్మకానికుంది.వాళ్లంతా హైదరాబాదులో సెటిలయ్యారు. ఇక్కడ యిల్లమ్ము కుని, అక్కడ కట్టుకుందామనుకుంటున్నారు—అని చెప్పాడు. రెండు రోజులు వుండమనికూడ మరీ మరీ చెప్పాడు. సాయంత్రం ఆ యిల్లు చూచివద్దా మని చెప్పాడు. అన్నిటికి విశ్వనాథంగారు అంగీక రించారు.

భోజనాలయి కాసేపు పడుకున్న తర్వాత నాలు గింటికి వెంకటేశ్వర్లు విశ్వనాథంగారిని ఆ యింటికి తీసుకువెళ్లాడు. ఇల్లు బాగానేవుంది. కాని ఖరీదే ఎక్కు వనిపించింది—ఇరవై వేల రూపాయలట.

ఒకటి, రెండు భాగాలు అద్దె కివ్వవచ్చు. నువ్వూ మీ ఆవిడే కనుక మీకు ఓ వంటిల్లూ గది సరిపోతుంది – బజారుకూ, కాలేజీకి దగ్గిర–అద్దెల వలన డెబ్బయి ఎనభయి రూపాయలు వస్తాయి అని ఆ యింటి గురించి చెప్పాడు వెంకటేశ్వర్లు.

'ధర ఎక్కువేమీ' అంటే వెంకటేశ్వర్లు నవ్వి 'పిచ్చివాడా! ఇక్కడ స్థలం ఇరవై రూపాయలు వుంది. 500 గజాల స్థలం–పైన యీ మాదిరి యిల్లు యిప్పుడు కట్టించాలంటే కనీసం పదిహేను యిరవై వేలు అవుతుంది. మొన్న నీ మధ్య మా యింట్లో ఒక గోడ కట్టించేటప్పటికి వెయ్యి రూపాయి లయింది—' అని అంటూవుంటే నిజమే అనిపించింది.

వెంకటేశ్వర్లు ట్యూషను కుర్రవాళ్లు వచ్చే వేళయింది అని వెళ్లిపోయాడు—

విశ్వనాథంగారు కాసేపు అటూ యిటూ తిరిగి మరి కాసేపు పార్కులో కూర్చుని పాండురంగడి గుడికి వెళ్దామనుకుంటూ బయలుదేరాడు—

ఒక కొట్టులోంచి ఎవరో చప్పట్లు కొట్టి పిలుస్తుంటే అటు చూశాడు విశ్వనాథంగారు–ఎవరో ఒక స్థూలకాయుడు పిలుస్తున్నాడు –విశ్వనాథంగారు పోల్చుకున్నారు—అతని పేరు సుబ్బారాయుడు–చదువు కునే రోజుల్లో చాల అల్లరి పిల్లాడని పేరు—

ఇప్పుడు అతను పుస్తకాల షాపు నడుపు తున్నాడు– మామూలు భోగట్టాలు క్షేమ సమా చారాలు పూర్తిఅయ్యాక విశ్వాథంగారు తన ఉద్దేశా లని బయటపెట్టాడు–సుబ్బారాయుడు – కొట్టులో కుర్రాడికి రెండు కాఫీలు తీసుకు రమ్మని చెప్పాడు—

'విశ్వనాథం– నీ ఆలోచనలకు అడ్డు వస్తు న్నానని అనుకోకు–ఈ వూళ్లో ఇల్లు కట్టుకుని వుండడం కన్నా–యింట్లో అద్దెకు వుండడం ఎక్కువ లాభం–ప్రతి సంవత్సరమూ రిపేర్లే ఈ వూళ్లో– వుప్పనేల అవడంతో చవుడు వూరుతూ వుంటుంది– ఈ వూళ్లో నువ్వు సెటిల్ అవాలనుకుంటున్నావు– మంచి ఆలోచనే–నలభయి ఏభయి రూపాయలలో మంచి పోర్షను వస్తుంది. నువ్వు యింటిమీద పెట్టే డబ్బు బిజినెసులో యిన్వెస్టుచేయి—మంచి లాభాలు వస్తాయి. నీకూ ఓ వ్యాపకం వుంటుంది' అన్నాడు.

'బిజినెసు వ్యవహారాలు నాకేమి తెలుసు–ఐనా ఏ బిజినెసులో యిన్వెస్టు చేయను? నాకన్ని లైనులూ కొత్తే అన్నారు విశ్వనాథంగారు.

'ఉద్దేశం ఉండాలేతప్ప—ఇన్వెస్టు చేయడానికి బిజినెస్సే దొరక్కపోతుందా?—మాట వరుసకి నాకు పెట్టుబడిపెట్టే పొర్టనరేవుంటే — లాభాలు వేలు సంపాదించి యివ్వగలను—ఈ మధ్య హైద్రాబాదుకు వెళ్లాను—మా అమ్మాయి గారింటికి—వాళ్ల యింటి పక్కనీ పబ్లిక్ లైబ్రరీసు ఆఫీసులో పనిచేసే 'నీ పోజిషను'లోవున్న ఆఫీసరు వున్నాడు. నాలుగు పుస్తకాలు అచ్చువేయించండి, స్టేటులోవున్న అన్నీ లైబ్రరీలచేత కొనిపిస్తా అన్నాడు. మా అబ్బాయి పేరు పడ్డ రచయిత—వాడి నవలలు వున్నాయి—వాడికి చాల మంది రైటర్ఫ్రెండ్సు వున్నారు—వాళ్ల తమ నవలలు యిస్తారు-వీటన్నిటికీ మార్కెటులో మంచి వాల్యూవుంది. దీనికితోడు ఓ ప్రింటింగు ప్రెస్సు పెడ్తే మన పనీతప్ప బోలెడు జాబు వర్కుచేయచ్చు—నాకున్న కాంటాక్ట్సు అటువంటివి—నువ్వు పెట్టుబడిపెట్టు—నీ పెట్టుబడిమీద ఇంటరెస్టు—లాభంలో సావు వాటా యిస్తాను'—అంటూ చిన్నసైజు ఉపన్యాసం యిచ్చాడు.

సుబ్బారాయుడు చెప్పేదాంట్లోనూ పాయింటు లేకపోలేదు అనిపించింది విశ్వనాథంగారికి.

'ఎంత పెట్టుబడి కావలసి వుంటుందేమిటి?' విశ్వనాథంగారు కుతూహలంగా అడిగాడు—

'పిండికొద్దీ రొట్టె— కనీసం ఇరవైవేలయినా వుంటే,' అని నసిగాడు సుబ్బారాయుడు—

ఈలోగా కుర్రాడు కాఫీ తెచ్చాడు—కాఫీ చప్పరిస్తూ విశ్వనాథంగారు షాపును పరికించి చూచాడు—బీరువాలు దాదాపు ఖాళీగా వున్నాయి—తను వున్న యింతసేపూ ఎవరూ కొట్టులో అడుగుపెట్టిన పాపాన పోలేదు—

ఆలోచించి చెప్తానని బయటకు నడిచాడు విశ్వనాథం—

'రేపు వుంటావా?' అని అడిగాడు సుబ్బారాయుడు—

'వుంటాను—వెంకటేశ్వర్లు సాయంత్రం అక్కడికి వచ్చేయమని మరీ మరీ అడిగాడు—అంతయదిగా చెప్పినప్పుడు మానడం దేనికిలే—అని అనుకుంటున్నాను.'

'వెంకటేశ్వర్లుగారితో — జాగ్రత్తగా వుండు, అన్నాడు యధాలాపంగా

'అంటే అన్నాడు' విశ్వనాథంగారు ఆశ్చర్యంగా.

'మనుష్యుల స్వభావాలు—ఆలోచనలు—ముప్పది ఐదేళ్ల క్రితం ఎల్లా వుంటాయో—ఇప్పుడూ అల్లాగే వుంటాయని భ్రమ పడకు-సరే రేపు కలుస్తాను వెంకటేశ్వర్లు యింట్లో' అన్నాడు సుబ్బారాయుడు—

విశ్వనాథంగారు యింక వివరణలు కోరలేదు—

చిలకలపూడికి వెళ్లి పాండురంగడిని దర్శించి వెంకటేశ్వర్లు యింటికి రిక్షామీద వచ్చాడు—రిక్షా వాడు పేచీపెట్టాడు.దురుసుగామాట్లాడాడు. ఈవూళ్లో మనుష్యులు యింత పొగరుగా జవాబు యిస్తారని ఆయన వూహించలేకపోయాడు—

భోజనాల దగ్గర మబ్బారాయుడి విషయం విశ్వనాథంగారు వెంకటేశ్వర్లు దగ్గర ప్రస్తావించాడు—వాడా వూరంతా అప్పులు, ఐ పి పెట్టడానికి సిద్ధంగా వున్నాడు—యిప్పటికి యిద్దరు ముగ్గుర్ని ఆర్పాడు—జాగత్త—అని వెంకటేశ్వర్లు హెచ్చరించాడు—

భోజనాలయి కాసేపు కబుర్లు చెప్పుకున్నాక వసారాలో మంచంవేస్తే దానిమీద పడుకున్నాడు—బాగానే నిద్రపట్టింది — ఒక రాత్రివేళ మెలకువ వచ్చింది—అప్పుడు పన్నెండున్నర దాటింది — పక్క గదిలో పడుకున్న వెంకటేశ్వర్లు అతని భార్య మాటలు నెమ్మదిగా నయినా స్పష్టంగానే వినిపిస్తున్నాయి—

'అదేమిటండీ — ఆ యింటికి చెడ్డపేరుంది — ఎవరూ అద్దెకు కూడా రాకపోవడంవల్లనే కదా—వాళ్లు ఏదో కాడికి అమ్మివేయా లనుకుంటున్నారు—పన్నెండు వేలు కూడా ఎవరూ యివ్వబోవడంలేదు—తెలియని వాళ్లని చూచి మరీ అంత ఎందుకు చెప్పారండీ?'—అంది ఆవిడ అమాయకంగా—

'హుష్—నోర్మూయ్—లేకపోతే అమ్మాయి పెళ్లి ఎల్లా అవుతుంది—వెర్రిముండాకొడుకు—ఈ వూరు మీద మోజుపడి వచ్చాడు—ఏముందీ వూళ్లో వాడి మొహం'—

ఎవరో కొరడా పుచ్చుకొని కొట్టినట్లని పించింది—

'తన పిచ్చి సెంటిమెంటును వీళ్లంతా ఎక్స్ప్లాయిటు చేస్తున్నారు.

పాలు పెరుగు ధర—ఏమంత తక్కువగా లేదనీ, అద్దెలు ఎక్కువగానే వున్నాయనీ, యిందాక మాటల సందర్భంలో తేలింది?

ఈ వూరిమీద ఎందుకు యింత అభిమానం చూపాలో తనకి యిప్పుడు అర్థం కావడం లేదు. వూరు అదే—కాని మనుష్యులు వేరు.

ఒరిస్సాలో తాను ముప్పది ఐదేళ్లు వున్నాడు. ఈ వూళ్లోకన్నా ఎక్కువ రోజులే వున్నాడు. ఐనా దాన్ని ఎందుకు తనదిగా భావించలేకపోయాడు. తన పూర్వులు అనగా తాత ముత్తాతలు బళ్లారిజిల్లాలో వుండేవారుట— వాళ్లు కన్నడం మాట్లాడేవారుట. క్రమంగా ఈ ప్రాంతానికివచ్చి యిక్కడ స్థిరపడి పోయారు తనకు కన్నడ భాషరాదు. తను కన్నడిగ అనికాక ఆంధ్రుడని భావించుకుంటున్నాడు. ఇప్పుడు తను ఒరిస్సాకి వెళ్లిపోయాడు. తన కొడుకులు మన వలు తాము ఆంధ్రులమనికాక, ఉత్కళులమనిభావించు కుని ఉత్కళదేశంపట్ల అభిమానం చూపవచ్చు— అందులో తప్పేముంది? అదీ యిదీకూడా భారత దేశమే—శాస్త్రి, శర్మ, రావు, మూర్తుల వంటివారే పాత్రో, పట్నాయక్, మహంతీలుకూడా...ఈ సత్యం చిన్నదయినా తన కూతురు గ్రహించింది. ఆమె, తెలుగు ఉత్కళ అనే భేదంలేక ఒక ఒరియా యువకుడిని పెళ్లి చేసుకుంటానంటే తనెందుకు అడ్డు చెప్పాలి?

ఎప్పుడో ముప్పది ఐదేళ్ల క్రితం తమ సంబంధం కోల్పోయిన ఈ వూరితో తిరిగి 'సంబంధాలు పెట్టు కోవడం'కన్నా, 'మిత్రులు' అనబడేవారి వంచనకు గురి కావడంకన్నా-తను యిన్నేళ్లుగా నివసించిన ఆ ప్రాంతంలోనే స్థిరపడ్డమా, వ్యాపారం చేసుకోవడమూ మంచిది కాదా అనిపించింది—

భ్రమ తెరలు జారిపోయాయి—

మర్నాడు ఉదయం ఎనిమిదింటికే సుబ్బారాయుడు వచ్చాడు—ఇల్లు కొనుక్కోవడము మంచిదని వెంకటేశ్వర్లూ వ్యాపారంలో యిన్వెస్టు చేయడం మంచిదని సుబ్బారాయుడు -నెమ్మదిగా వాదించుకోవడం ప్రారంభించి- 'చివరకు 'త్వం శుంఠా...అంటే త్వం శుంఠా'- అనే స్థాయిని జేరుకోబోతూవుండగా విశ్వనాథంగారే అన్నారు- 'వెంకటేశ్వర్లూ— నీ కూతురి పెళ్లికి డబ్బు కావాలంటే నాతో చెప్పు ప్రయత్నిస్తాను. సుబ్బారాయుడూ అప్పులవాళ్ల బాధ తప్పించు కోవడానికి నీకు నేనేసహాయం చెయ్యమంటావు— నా ఎడ్రసు యిస్తాను వ్రాయండి-ఆ విషయం ఆలోచిస్తాను—ప్రస్తుతానికి ఈ వూరికి వచ్చే ఆలోచన మానుకున్నాను...అంటూ విశ్వనాథంగారు తన హేండు బ్యాగు పుచ్చుకుని విసవిసా బయటికి నడచిపోతుంటే 'డామిట్ కథ అడ్డం తిరిగింది' అన్నట్లు వెంకటేశ్వర్లూ సుబ్బారాయుడు తెల్లబోయి ఆయన వెళ్లిన వంకే చూస్తూ నిలుచుండి పోయారు.

---